
సాక్షి
బాపట్ల
బుధవారం । 5 । జూన్ । 2024



ఎస్‌బీఐ బస్సు వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 28 లక్షల విలువైన బస్సును శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి మంగళవారం అందచేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.30 అడుగుల వద్ద ఉంది.



అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన ఆంధ్ర నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

టీడీపీ కవ్వింపు చర్యలు

- రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- పోలీసుల రాకతో సర్దుబాటు

యద్లపాడు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఫలితాలు వెలువడిన సందర్భంగా ఎవరూ బాణసంచా కాల్చడం, సంబరాలు చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ కూడా ఇవే హెచ్చరికలు చేసింది. అయినా వీటన్నింటిని బేఖాతరు చేస్తూ యద్లపాడులో టీడీపీ నాయకులు భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. దీనికి తోడు వైఎస్సార్ సీపీ ఎన్నికల చిహ్నమైన సీలింగ్ ఫ్యాన్లు ద్విచక్రవాహనాలకు కట్టి ఎస్సీ కాలనీలోకి ప్రదర్శనగా తీసుకువెళ్లి అక్కడి వారిని కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఇరుపార్టీల మధ్య వాగ్వాదాలు జరిగి రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఘర్షణ తాత్కాలికంగా సర్దుమణిగింది. ఈ ఘర్షణలో ఇరుపార్టీలకు చెందిన నలుగురికి గాయాలయ్యాయి.

ప్రకాశం జట్టుపై గుంటూరు విజయం



సెంచరీ చేసిన గుంటూరు జట్టు ఆటగాడు రషీద్

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు ఏసీఏ గ్రౌండ్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల వన్‌డే క్రికెట్ పోటీల్లో మంగళవారం ప్రకాశం జిల్లా, గుంటూరు జిల్లా జట్లు మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 324 పరుగులు చేసింది. ఆ జట్టు ఆటగాడు ఎస్కే రషీద్ 109 బంతులు ఎదుర్కొని 103 పరుగులతో నిలిచాడు. 4ఫోర్లు, ఒక సిక్స్‌తో ఆకట్టుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జిల్లా జట్టు 35.1 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 130 పరుగులతో గుంటూరు జట్టు విజయం సాధించింది.

నోడల్ అధికారికి షోకాజ్ నోటీసు జారీ

నరసరావుపేట: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సిబ్బందికి సక్రమంగా భోజనం సదుపాయం చేయని అధికారులపై కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ కొరడా ఝుళిపించారు. మంగళవారం జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ ప్రక్రియలో సిబ్బందికి ఏర్పాటుచేసిన భోజన సదుపాయాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ నోడల్ అధికారి, పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సుబ్బరాయుడుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

జిల్లాలో కూటమికే పట్టం



అనగాని సత్యప్రసాద్



వేగేశన నరేంద్రవర్మ



ఏలూరు సాంబశివరావు



గొట్టిపాటి రవికుమార్



ఎంఎం కొండయ్య



బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

- బాపట్ల నుంచి టీడీపీ అభ్యర్థి నరేంద్రవర్మ గెలుపు
- రేపల్లెలో టీడీపీ అభ్యర్థి అనగాని విజయం
- అద్దంకి, పర్చూరు, చీరాల, వేమూరుల్లోనూ టీడీపీ అభ్యర్థుల గెలుపు
- గెలుపొందిన బాపట్ల టీడీపీ ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్
- మంగళవారం రాత్రివరకూ కొనసాగిన కౌంటింగ్
- ఆనందంలో కూటమి పార్టీలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల, : మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు విజయం సాధించాయి. జిల్లాలో బా పట్ల పార్లమెంట్‌తోపాటు రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అన్ని స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. రేపల్లె టీడీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈవూరి గణేష్‌పై 40,018 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

- బాపట్ల టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతిపై 27,768 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- వేమూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరికూటి అశోక్ బాబుపై టీడీపీ అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు 21,516 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- పర్చూరు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ఈవీఎం ఓట్లలో 1,08,941 రాగా, పోస్టల్ బ్యాలెట్‌లో 1634 తో కలిపి మొత్తం 1,10,575 వచ్చాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యడం బాలాజీకు ఈవీఎం ఓట్లు 85,571 రాగా, పోస్టల్ బ్యాలెట్‌లో 991 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీపై 24,013 ఓట్ల అధిక్యతతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గెలుపొందారు.



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వేమూరు టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించారు. దాంతో ఆ పార్టీ నేతలు సంబరాల్లో మునిగారు. నియోజకవర్గంలో మొత్తం 2,44,057 ఓట్లు ఉండగా అందులో 298 పోలింగ్ బూత్‌ల ద్వారా 2,15,077 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ 1,07,085 ఓట్లు సాధించగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి 85,083 ఓట్లు సాధించారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్ బాబు 3830 ఓట్లు సాధించాడు. టీడీపీ అభ్యర్థి రవికుమార్ 25,070 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.



బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న కౌంటింగ్

సార్వత్రిక ఎన్నికల్లో చీరాల టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య విజయం సాధించారు. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును మంగళవారం జిల్లాలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న 2,02,711 మంది ఓటర్లలో 1,67,466 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల, వేటపాలెం మండలాల్లో ఏర్పాటు చేసిన 218 పోలింగ్ కేంద్రాల్లో 1,67,466 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం కౌంటింగ్‌లో 16 రౌండ్లులో ఓట్ల లెక్కింపు నిర్వహించగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌పై టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.ఎం.కొండయ్య 22,558 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెంకటేష్‌కు 50,802 ఓట్లు, కొండయ్యకు 71,360 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌కు 41,295 ఓట్లు వచ్చాయి.

బాపట్ల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన తెన్నేటి కృష్ణప్రసాద్ వైఎస్సార్ సీపీకి చెందిన సిట్టింగ్ ఎంపీ నందిగం సురేష్‌పై 16 రౌండ్లు ముగిసే సమయానికి 1,79,653 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్ తెలంగాణకు చెందిన బీజేపీ నేతకాగా, చివరి నిమిషంలో చంద్రబాబు ఆయనను బాపట్ల టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. కృష్ణప్రసాద్ ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. జిల్లాలోని బాపట్ల పార్లమెంట్ తోపాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి పోటీ చేసిన అభ్యర్థులందరూ విజయం సాధించడంతో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

రాత్రి వరకూ ఓట్ల లెక్కింపు..

మంగళవారం ఉదయం ఆరు గంటలకే స్ట్రాంగ్ రూంలను ఓపెన్ చేసిన అధికారులు ఆ తర్వాత ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపును చేపట్టినా.. లెక్కింపు రాత్రి 9 గంటలవరకూ సాగింది. 15 రౌండ్లు ఉన్న బాపట్ల ఫలితం మధ్యాహ్నమే వెలువడినా 17, 19, 22 రౌండ్లు ఉన్న మిగిలిన నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మరింత ఆలస్యమైంది.

భారీ బందోబస్తు నడుమ కౌంటింగ్



ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచలుగా బందోబస్తు ఏర్పాటు చేసి ప్రధాన ద్వారం వద్దకు చేరుకునే అరకిలో మీటరు ముందు బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ అందరినీ తనిఖీలు చేసి గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలకు అనుమతించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. పూర్తిస్థాయి ప్రణాళికలతో ఎటువంటి ఘటనలకు తావులేకుండా పహారా చేపట్టారు. నాగార్జున యూనివర్సిటీ మీదుగా రాకపోకలను నియంత్రించడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.



నాగార్జున యూనివర్సిటీ వద్ద నిర్మానుష్యంగా ఉన్న నంబూరు రోడ్డు





బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తున్న సిబ్బంది

పల్నాడులో టీడీపీదే గెలుపు

- జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం
- నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుంచి మరోసారి ఎంపీగా లావు
- ఓటమిపాలైన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు
- తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన జూలకంటి, భాష్యం, చదలవాడ
- ఉదయం 8 గంటలకే ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ
- ఆలస్యమైన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన అధికారులు

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి పల్నాడు ప్రజలు పట్టం కట్టారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానంలో టీడీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికలలో పోటీ చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా ఓటమిపాలయ్యారు. గత రెండు నెలలుగా సాగిన సుదీర్ఘమైన ఎన్నికల సంగ్రామం ముగిసింది. నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ప్రస్తుత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు టీడీపీ తరఫున గెలుపొందారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌పై 1,59,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. లావు శ్రీకృష్ణదేవరాయలు 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి తొలిసారి ఎంపీగా గెలుపొందిన విషయం తెలిసిందే.

సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్నా

సత్తెనపల్లిలో ఎవరు గెలిస్తే ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్‌ను బలపరిచే విధంగా 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. సత్తెనపల్లి ఎమ్మెల్యేగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ సమీప ప్రత్యర్థి మంత్రి అంబటి రాంబాబుపై గెలుపొందారు. అంబటిపై కన్నా 27,836 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

పెదకూరపాడు నుంచి ప్రవీణ్

పెదకూపాడు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు శంకరరావుపై 21,089 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తొలిసారి ఎన్నికల్లో పోటీచేసిన ప్రవీణ్ మొదటి ప్రయత్నంలోనే అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

గురజాల నుంచి యరపతినేని

గురజాల అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమీప ప్రత్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై 29,486 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. యరపతినేని ఇప్పటికే నాలుగుసార్లు గురజాల ఎమ్మెల్యేగా గెలుపొందారు.

మాచర్ల నుంచి జూలకంటి

మాచర్ల అసెంబ్లీ స్థానం నుంచి జూలకంటి బ్రహ్మారెడ్డి తొలిసారి గెలుపొందారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై 33,318 ఓట్ల తేడాతో గెలుపొందారు. జూలకంటి బ్రహ్మారెడ్డి గతంలో 2004, 2009 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిచెందారు. మూడో ప్రయత్నంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

వినుకొండ ఎమ్మెల్యేగా జీవీ

వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గెలుపొందారు. సమీప ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మానాయుడుపై 29,683 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. జీవీ ఆంజనేయులు 2009, 2014 ఎన్నికలలో ఎమ్మెల్యే గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికతో మూడోసారి విజయం సాధించినట్లు అయ్యింది.

నరసరావుపేటలో చదలవాడ విజయం

నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా చదలవాడ అరవింద్‌బాబు గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై 19,705 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో చదలవాడ తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. అరవింద్‌బాబు 2019 ఎన్నికల్లో గోపిరెడ్డిపై పోటీచేసి ఓడిన విషయం తెలిసిందే.

చిలకలూరిపేట నుంచి ప్రత్తిపాటి...

చిలకలూరిపేట అసెంబ్లీ స్థానం నుంచి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడుపై 33,262 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మంత్రిగా పనిచేసిన పుల్లారావు గతంలో మూడుసార్లు ఇదే స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఉదయం 8 గంటల నుంచి మొదలైన కౌంటింగ్...

నరసరావుపేట జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అంతకుముందు తెల్లవారుజామున 5 గంటల నుంచే కౌంటింగ్ సిబ్బంది, సహాయకులు, పార్టీల గుర్తింపు పొందిన కౌంటింగ్ ఏజెంట్లు జేఎన్‌టీయూ ప్రాంగణానికి చేరుకున్నారు. కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ టేబుళ్లను కేటాయించారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. జిల్లాలో 19 వేలకు పైగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండటంతో కౌంటింగ్ బాగా ఆలస్యమైంది. రాత్రి 8 గంటల వరకు పోస్టల్ ఓట్ల లెక్కింపు కొనసాగింది. మరోవైపు ఈవీఎం ఓట్ల లెక్కింపు ఉదయం 8.30 గంటలకు ప్రారంభించారు. ఉదయం 11 గంటలకల్లా ఓట్ల లెక్కింపు ట్రెండ్ దాదాపుగా తెలిసిపోయింది.

గుంటూరులోనూ కూటమి హవా

- ఏడు స్థానాల్లో పాగా
- గుంటూరు లోక్‌సభలోనూ హవా
- తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్న ముగ్గురు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. గుంటూరు పార్లమెంట్‌ను పెమ్మసాని చంద్రశేఖర్ కైవసం చేసుకోగా, ఏడు అసెంబ్లీ సీట్లలో ఒకటి జనసేన, మిగిలిన ఆరు స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు పాగా వేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

'బూర్ల' బుట్టలో ప్రత్తిపాడు



ప్రత్తిపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులు 41,151 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. తెలుగుదేశం అభ్యర్థికి 1,26, 988 ఓట్లు రాగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బలసాని కిరణ్‌కుమార్‌కు 85,652 ఓట్లు వచ్చాయి.

ధూళిపాళ్లదే పొన్నూరు



పొన్నూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం సీనియర్ నేత దూళిపాళ్ల నరేంద్ర 32,915 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఇక్కడ పోటీ చేసిన దూళిపాళ్ల నరేంద్రకు 1,10,410 ఓట్లు రాగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణకు 77,495 ఓట్లు వచ్చాయి.

గల్లా మాధవికే గుంటూరు పశ్చిమ



గుంటూరు పశ్చిమ నియోజకవర్గం సార్వత్రిక ఎన్నికలలో 51,160 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి గెలుపొందారు. మొత్తం 1,88,519 ఓట్లు పోలవ్వగా గల్లా మాధవికి 1,16, 067, వైఎస్సార్ సీపీ అభ్యర్థి విడదల రజినికి 64,917 ఓట్లు పోలయ్యాయి.

తూర్పున నసీర్ అహ్మద్ వెలుగు




గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి నసీర్ అహ్మద్ విజయం సాధించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిని షేక్ నూరి ఫాతిమాపై 31,962 ఓట్ల తేడాతో గెలుపొందారు. టీడీపీ అభ్యర్థి నసీర్ అహ్మద్ 1,00,815 ఓట్లు సాధించారు. వైసీపీ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా 68,853 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన షేక్ మస్తాన్‌వలి 5,239 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.

పెమ్మసానికి 3,44,695 ఓట్ల ఆధిక్యత



గుంటూరు ఎంపీగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ 3,44,695 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. పెమ్మసాని చంద్రశేఖర్‌కు 8,64,948 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్ సీపీ అభ్యర్థి కిలారు రోశయ్యకు 5, 20,253 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్లు పెమ్మసానికి 13,730 రాగా కిలారు రోశయ్యకు 6,578 వచ్చాయి.

తెనాలిలో నాదెండ్ల పైచేయి



తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసిన కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌పై 48,112 ఓట్ల తేడాతో గెలిచారు. మొత్తం 2,06,355 ఓట్లు పోలవగా మనోహర్‌కు 1,23,961 ఓట్లు, శివకుమార్‌కు 75,849 ఓట్లు దక్కాయి.

తాడికొండలో శ్రావణ్‌కు భారీ ఆధిక్యం



తాడికొండ నియోజకవర్గంలో తెనాలి శ్రావణ్ కుమార్ భారీ అధిక్యంతో గెలుపొందారు. మొత్తం పోలైన 1,82,149 ఓట్లకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరితకు 69,030 ఓట్లు రాగా తెనాలి శ్రావణ్ కుమార్‌కు 1,08,346 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో శ్రావణ్ కుమార్‌కు 1,239 ఓట్లు రాగా, మేకతోటి సుచరితకు 677 ఓట్లు వచ్చాయి.

మంగళగిరిలో లోకేష్‌కు అనూహ్య మెజారిటీ



మంగళగిరి నుంచి తెలుగుదేశం అభ్యర్థి నారా లోకేష్ అనూహ్యమైన మెజారిటీతో గెలుపొందారు. తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. నారా లోకేష్‌కు ఈవీఎంల ద్వారా 1,65,512 ఓట్లు, పోస్టల్ ఓట్లు 2,198 మొత్తం 1,67,710 ఓట్లు లభించాయి. ఇక్కడ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యకు ఈవీఎంల ద్వారా 75352 ఓట్లు, పోస్టల్ ఓట్లు 945 మొత్తం 76297 ఓట్లు లభించాయి.

క్లుప్తంగా

రెండు కార్లు ఢీ.. ఏడుగురికి గాయాలు



పామర్రు: రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. ఈ ప్రమాదం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో మండల పరిధిలోని కొండిపర్రు అడ్డరోడ్డు వద్ద మంగళవారం జరిగింది. విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు ప్రయాణిస్తున్న రెండు కార్లు ఒకదానిని ఒకటి ఓవర్ టేక్‌చేసే ప్రయత్నంలో ఢీకొన్నాయి. ఒక కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పంటబోదెలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రెండు కార్లలో ఉన్న ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మత్స్యకారుడు మృతి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): అనుమానాస్పద స్థితిలో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటనపై ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నం గిలకలదిండికి చెందిన తమ్ము శంకరరావు (32) చేపల వేటకు వెళ్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని లాడ్జిలో రూమును అద్దెకు తీసుకున్నాడు. భార్య వాణి భోజనానికి రమ్మని ఫోన్ చేయడంతో రావడం లేదని చెప్పాడు. మరి కొద్ది సేపటికి శంకరరావు స్నేహితుడు హోటల్ గదికి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన శంకర్రావు స్నేహితుడు వెంటనే వాణికి ఫోన్ చేసి చెప్పాడు. వాణి కుటుంబ సభ్యులతో కలిసి హుటాహుటిన హోటల్ వద్దకు వెళ్లి మగతాజీవిగా పడి ఉన్న భర్తను చూసి భోరున విలపించింది. ఈ సమాచారం అందుకున్న ఆర్‌పేట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌తో షేక్

అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్న యువతి షబీనా



షేక్ షబీనా

తెనాలి: పవర్ లిఫ్టింగ్.. బరువులెత్తే ఈ క్రీడలో ఇప్పుడు పేదింటి యువతులు రాణిస్తున్నారు. చదువుతోపాటు బరువులు ఎత్తుతూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తలపడుతున్నారు. అలవోకగా బంగారు పతకాలను సాధిస్తున్నారు. ఆ క్రీడలో తమ స్టామినాను చాటుతున్నారు. వీరిలో తెనాలికి చెందిన షేక్ షబీనా ఒకరు. అంతర్జాతీయ పోటీల్లో పతకాలతో జైత్రయాత్ర కొనసాగిస్తోంది.

హాంకాంగ్‌లో గత నెలలో జరిగిన ఆసియన్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ కమ్‌ఆసియన్ యూనివర్శిటీ కప్–2024 పోటీల్లో తెనాలి పవర్‌లిఫ్టర్ షేక్ షబీనా మెరిసింది. జూనియర్ విభాగంలో పోటీపడిన షబీనా స్క్వాట్, బెంచ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలను సాధించింది. మూడు విభాగాల్లోను కలిపి టోటల్‌లోనూ మరో పతకంతో మొత్తం నాలుగు బంగారు పతకాలను సాధించటం విశేషం. గత రెండేళ్లుగా పవర్ లిఫ్టింగ్‌లో నిలకడగా విజయాలను సాధిస్తున్న షబీనా, 2023 మేలో కేరళలో జరిగిన ఆసియా పవర్‌లిఫ్టింగ్ పోటీ ల్లో నాలుగు బంగారు పతకాలు, ఆ వెంటనే తమిళనాడులో జరిగిన జాతీయ పోటీల్లో ఏకంగా మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్న ఘనత షబీనాది. అంతకుముందు హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ లోనూ మూడు బంగారు పతకాలు, రజత పతకం సాధించింది. ఆసియా పోటీల్లో వరుసగా రెండేళ్ల నాలుగేసి బంగారు పతకాలను గెలుచుకోవటం విశేషం.

తల్లి ప్రోత్సాహంతో..

పట్టణ ఆర్ఆర్ నగర్‌కు చెందిన ఆటో ఎలక్ట్రీషియన్ మెకానిక్ బుజ్జి, షంషద్‌ల ఏకైక కుమార్తె. గత మార్చిలో ఇంటర్ పూర్తిచేసింది. పదోతరగతిలో ఉండగా పవర్‌లిఫ్టింగ్‌కేసి ఆసక్తి చూపిన కుమార్తెను తల్లి ప్రోత్సహించింది. కామన్‌వెల్త్ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన తెనాలి యువతి జి.సాయిరేవతి శిష్యరికంలో కొంతకాలం సాధన చేసింది. రాష్ట్ర పోటీల్లో పాల్గొని ఒకటి రెండు బహుమతులను గెలుచుకున్నాక ఆత్మవిశ్వాసం పెరిగింది. మంగళగిరి కేంద్రంగా నడుస్తున్న ఫిట్‌జోన్ జిమ్ గురించి తెలుసుకుని, అక్కడి కోచ్ ఎం.సంధానిని సంప్రదించారు. అక్కడి నుంచి సాధన మంగళగిరికి మారింది. స్థానికంగా ఒక ప్రైవేటు విద్యాసంస్థలో టీచరుగా పనిచేస్తున్న షంషద్ కుమార్తె కోసం ఉద్యోగాన్ని వదులుకుంది. కుమార్తెకు తోడుగా సాధనకు తోడ్పడింది. ఇంటర్‌లో కాలేజి తరగతులు అయిపోయి కుమార్తె ఇంటికి రాగానే, రెడీ అయిపోయి మంగళగిరి బస్సెక్కటం, మూడు గంటల సాధన తర్వాత తిరిగి రాత్రి పదిన్నర ప్రాంతంలో ఇంటికి చేరుకోవటం దినచర్యగా మారింది. పోటీలు దగ్గరకొస్తుంటే సెలవుల్లోనూ కఠోర సాధన కొనసాగిస్తూ వచ్చారు. అటు చదువు, ఇటు సాధన మినహా షబీనాకు మరో వ్యాపకం లేకుండాపోయింది.



తల్లిదండ్రులతో...

తొలి నుంచీ విజయాలు

ఇంత కష్టానికి తగిన ఫలితాలను తొలి నుంచే అందుకుందా విద్యార్థిని. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో తలపడుతూ బహుమతులను కైవసం చేసుకుంటూ వచ్చింది. 2020లో జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానంతో మొదలుకొని, 2021లో 7వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రజతం, 8వ సబ్‌జూనియర్, సీనియర్ ఛాంపియన్‌షిప్ రెండింటిలోనూ బంగారు పతకం గెలుచుకుంది. రాజస్థాన్‌లో జరిగిన 22వ సబ్‌జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. 2022లో విశాఖలో జరిగిన సౌతిండియా సబ్‌జూనియర్ పవర్‌లిఫ్టింగ్ లోనూ బంగారు పతకం గెలిచింది. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 3 బంగారు. 1 రజత పతకాన్ని సాధించింది. 2022-23లో విశాఖలో జరిగిన 9వ ఏపీ స్టేట్ సీనియర్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతితో 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను గెలిచింది.

అనంతరం కేరళలోని అలప్పుజాలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 84 కిలోల కేటగిరీలో తలపడిన షబీనా స్క్వాట్‌లో 172.5 కిలోల బరువునెత్తింది. బెంచ్ ప్రెస్‌లో 75 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 160 కిలోలను ఎత్తి, ఆ మూడింటిలో బంగారు పతకాలతోపాటు ఓవరాల్‌గా 407.5 కిలోల బరువులతో మరో బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ క్రమంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ఉత్సవాల సందర్భంగా పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియా, తమిళనాడు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన సబ్‌జూనియర్, జూనియర్ నేషనల్స్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్–2023లో సబ్‌జూనియర్స్ విభాగం పోటీల్లో షేక్ షబీనా 84 కిలోల కేటగిరీలో తలపడింది. స్క్వాడ్‌లో 180 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 72.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 157 కిలోలతో ఓవరాల్‌గా మొత్తం 410 కిలోల బరువులను ఎత్తింది. స్క్వాడ్, డెడ్‌లిఫ్ట్, ఓవరాల్ విభాగం.. మూడింటిలోనూ మూడు బంగారు పతకాలు, బెంచ్‌ప్రెస్‌లో రజత పతకాన్ని సాధించి, విజయబావుటాను ఎగురవేసింది. కామన్‌వెల్త్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు నెగ్గి, రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది షబీనా లక్ష్యం.

సబ్ జూనియర్స్, జూనియర్స్ ఫుట్‌బాల్ సెలక్షన్స్



జిల్లా జట్టుకు ఎంపికైన సబ్ జూనియర్స్, జూనియర్స్ క్రీడాకారులు

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చీరాలలోని ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడామైదానంలో సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలుర విభాగంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించారు. బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.విజయకుమార్, నాలుగు జిల్లాల కోఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య, కోచ్‌లు ప్రసన్న, నరేష్‌ల సమక్షంలో సెలక్షన్స్ జరిగాయి. మంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువ కలిగి ఉన్నట్లయితే మంచి ఉన్నతమైన క్రీడాకారులుగా ఎదుగుతారని వారు పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారని వారు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు బుధవారం గుంటూరులో జోనల్ మీట్‌లో ఆడుతారని వారు తెలిపారు. బాలికలు సెలక్షన్స్‌కు రానందున కేవలం బాలుర జూనియర్స్, సబ్ జూనియర్స్ జట్లను మాత్రమే ఎంపిక చేసినట్లు చెప్పారు.

వ్యక్తిపై టీడీపీ నాయకుడు కత్తితో దాడి

- నరసరావుపేటలో చోటుచేసుకున్న ఘటన
- హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



సంఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలవాల వెంకటరామిరెడ్డి

నరసరావుపేటటౌన్: వ్యక్తిపై టీడీపీ నాయకుడు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపనయ్యనగర్‌కు చెందిన అలవాల వెంకటరామిరెడ్డి గ్యాస్ గోదాంలో పనిచేస్తుంటాడు. మధ్యాహ్నం సమయంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిల్చొని ఉండగా మద్యం తాగి వచ్చిన వార్డు టీడీపీ నాయకుడు సైకం రామాంజనేయరెడ్డి వాగ్వివాదానికి దిగి అతని వెంట తెచ్చుకున్న కత్తితో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని స్థానికులు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు ఎక్కువ.. ఎంపీకి తక్కువ ఓట్లు

- పెడన నియోజకవర్గంలో అసెంబ్లీకి పోలైన ఓట్లు 1,47,527
- పార్లమెంటు స్థానానికి 442 ఓట్లు తక్కువగా పోలైన వైనం

పెడన: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెడన నియోజకవర్గంలోని 216 బూత్‌లలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఒకేసారి ఈవీఎంల ద్వారా ఓట్లు వేశారు. అయితే ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎక్కువ, ఎంపీ అభ్యర్థులకు తక్కువ ఓట్లు పోలయ్యాయి. వాస్తవంగా ఒక ఓటరు అదే బూత్‌లో రెండు ఈవీఎంల వద్దకు వెళ్లి రెండు ఓట్లు వేయాల్సి ఉంది. రెండు కూడా సమానంగా ఓట్లు ఉండాలి. కానీ ఎంపీ ఓట్లు తగ్గడం గమనార్హం. ఓటర్లు సక్రమంగా నొక్కకపోవడం, బూత్‌లో ఉన్న అధికారులు వాటిని పట్టించుకోకపోవడం వల్ల తక్కువగా ఓట్లు నమోదై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా అసెంబ్లీ పరిధిలో ఓట్ల లెక్కింపునకు మొత్తం ఓట్లు 1,47,527 ఓట్లు లెక్కించారు. ఇదే నియోజకవర్గంలో మచిలీపట్నం పార్లమెంటుకు 1,47,085 ఓట్లు లెక్కించారు. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం 442 ఓట్లు ఉండటం విస్మయానికి గురిచేస్తోంది.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



ఉంగుటూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: మండలంలోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు మంగళవారం ఉత్సాహంగా కొనసాగాయి. శిబిరాలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, మానికొండ గ్రామాల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు, న్యూస్ పేపర్ చదివించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, స్నేక్ అండ్ లేడర్, లెమన్ స్పూన్ వంటి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

వేసవి శిబిరాలతో నైపుణ్యాలకు పదును

కంకిపాడు: వేసవి శిబిరాలతో నైపుణ్యాలకు పదును పెరుగుతుందని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తెన్నేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పారాయణం, కథల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. వేసవి శిబిరాన్ని ఆమె పర్యవేక్షించారు.

విజయోత్సవాలతో టీడీపీ బీభత్సం

- వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్ల ముందు హంగామా
- కవ్వింపు, రెచ్చగొట్టే చర్యలతో కార్యకర్తల వీరంగం
- చిన ఓగిరాల, కాటూరులో వైఎస్సార్ సీపీ నేతలకు బెదిరింపులు
- మహిళా నాయకురాలు శివజ్యోతి ఆత్మహత్యాయత్నం

ఉయ్యూరు/కంకిపాడు: విజయోత్సవ ర్యాలీలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కారు. పోలీసు ఆంక్షలను ఖాతరు చేయకుండా రోడ్లపై బాణసంచా కాల్చి హంగామా చేశారు. బైక్‌లు, కార్లతో ర్యాలీలు చేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. వైఎస్సార్ సీపీ నేతల ఇళ్ల ముందు ర్యాలీలు, కవ్వింపు చర్యలకు దిగి, అవమానకర ప్రవర్తనలతో రెచ్చిపోయారు. చినఓగిరాల, కాటూరు గ్రామాల్లో పేట్రేగిపోయారు. టీడీపీ శ్రేణుల అవమానాన్ని భరించలేక వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పాలడుగు శివజ్యోతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెనమలూరు నియోజకవర్గంలో కూటమి గెలుపుతో మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో టీడీపీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించి రచ్చచేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ నాయకురాలు పాలడుగు శివజ్యోతి ఇంటి వద్దకు వెళ్లి కవ్వించారు. చిన ఓగిరాల కిలాడీ లేడీ అంటూ పోస్టర్లు ప్రదర్శించి అవమానిస్తూ హేళన చేశారు. ఈ అవమాన భారం భరించలేక శివజ్యోతి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు హుటాహుటిన శివజ్యోతిని ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె మీడియాతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. మహిళ అని చూడకుండా యార్లగడ్డ సాయి, వెనిగళ్ల కుటుంబ రావు, మంచిగంటి రమేష్, పాలడుగు మల్లికార్జున రావు, కంచర్ల కోటేశ్వరరావు, గుమ్మడి కల్యాణ్, మరికొందరు అవమానకర వ్యాఖ్యలతో హేళన చేశారన్నారు. టీడీపీ గూండాల వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్యాయత్నం చేశానని రోదించారు. కాటూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేపల్లి రజనీకాంత్‌ను కవ్వించారు. రజనీకాంత్ ఉండే తోట వద్దకు బైక్‌లపై వెళ్లి సవాళ్లు విసిరారు. పోలీసులు రంగ ప్రవేశం చేయటంతో వివాదం సద్దుమణిగింది. ఉయ్యూరు పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లోనూ తెలుగుదేశం శ్రేణులు విజయోత్సవం పేరుతో అరాచకాలకు తెరలేపారు.



టీడీపీ నేతల అవమానకర ప్రవర్తనతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ శివజ్యోతి

తుంగలో ఎన్నికల కోడ్

విజయ గర్వంతో కూటమి నాయకులు ఎన్నికల కోడ్‌ను తుంగలో తొక్కారు. బైక్‌లతో హడావిడి చేస్తూ గ్రామాల్లో చెక్కర్లుకొట్టారు. ఉదయం నుంచే బాణసంచా కాలుస్తూ హడావిడి చేశారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో విజయోత్సవాలు చేయకూడదని, బాణసంచా కాల్చితే కేసులు తప్పవన్న ఎన్నికల సంఘం ఆదేశాలు, పోలీసుల హెచ్చరికలు అమలులో ఉన్నాయి. 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీసుయాక్టు అమలులో ఉన్నా టీడీపీ శ్రేణులు పట్టించుకోలేదు. విచ్చలవిడిగా గుంపులుగా బైక్‌లపై ర్యాలీలు చేస్తూ కవ్వింపునకు పాల్పడ్డారు. సోషల్ మీడియాలో సైతం రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వైఎస్సార్ సీపీని, పార్టీ శ్రేణులను హేళన చేశారు. ఎన్నికల రోజు దొంగ ఓట్లు పోలవడాన్ని ప్రశ్నించిన సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు మరి కొందరిపై రౌడీషీట్లు తెరిచారు. ఓట్ల లెక్కింపు రోజు విచ్చలవిడిగా రోడ్లపై బాణసంచా కాలుస్తూ, విజయోత్సవ ర్యాలీల పేరిట వైఎస్సార్ సీపీ నాయకులను కవ్వించిన టీడీపీ శ్రేణులు, కూటమిపై ఎలాంటి చర్యలుతీసుకుంటారో చూడాల్సి ఉంది.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి



గాయపడిన మౌనిక



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుజ్జి

పెనుగంచిప్రోలు: మండలంలో పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం అలజడి సృష్టించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడి చేసి పలువురిని గాయపరిచారు. అనిగండ్లపాడు గ్రామంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం ఇంటిపై దాడి చేసి సర్పంచ్‌ను గాయపరిచారు. బోశెట్టి మౌనిక తలపై కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. పలు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. దాడిపై జ్యోతిబ్రహ్మంతో పాటు మౌనిక పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుబ్బాయిగూడెం గ్రామంలో సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు ఇంటిపై దాడి చేశారు. నవాబుపేటలో గొర్రెపాటి బుజ్జి, శ్రీను, నాగేశ్వరరావు, మైసయ్య, బుజ్జిపై దాడి చేసి గాయపరిచారు. వారు నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సేంద్రియంతో భూమి బంగారం

వత్సవాయి: విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం కోల్పోతుంది. ఫలితంగా దిగుబడులు తగ్గిపోతాయి. అధిక మొత్తంలో రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి తన సహజ లక్షణాన్ని కోల్పోయి చౌడుగా మారే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. రసాయన మందులతో భూ సారం తగ్గడమే కాదు భూమిలో క్షారం క్షీణించి పైర్లకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల ఆలోచనల్లో మార్పు వచ్చింది. పశువుల ఎరువును వాడి భూసారాన్ని పెంచడంపై ఆసక్తి చూపుతున్నారు. మాగాణి, మెట్ట భూములకు గేదలు, ఆవులు, గొర్రెలు, మేకల విసర్జితాలను కొనుగోలు చేసి పంట పొలాలకు తోలుతున్నారు. పొలాల్లో గొర్రెలు, మేకలతో మందకట్టిస్తున్నారు. దీంతో వేరే ప్రాంతాల నుంచి మేత కోసం వచ్చే గొర్రెలు, మేకలతో మంద కట్టించేందుకు రైతులు పోటీపడుతున్నారు. దీంతో గొర్రెలు, మేకల కాపరులకు డిమాండ్ వచ్చింది. పగలంతా వేర్వేరు ప్రాంతాల్లో గొర్రెలు, మేకలను మేపుకొచ్చిన కాపరులు రాత్రికి రైతుల పొలంలో వాటిని ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో గొర్రెలను ఉంచినందుకు రూ.500 వరకు రైతుల నుంచి తీసుకుంటున్నారు. పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులు అందించేందుకు పశువుల ఎరువులు దోహదపతాయని రైతులు చెబుతున్నారు.



పంట పొలంలో మందకట్టిన గొర్రెలు

సేంద్రియ ఎరువుల వల్ల ఉపయోగాలు

- భూమిలో తేమశాతం పెరుగుతుంది. దీంతో మొక్కలకు సరిపోను తేమ అందుతుంది.
- పంటకు కావాల్సిన ముఖ్య పోషకాలు సేంద్రీయ ఎరువుల వల్ల అందుతాయి.
- సారవంతమైన సేంద్రీయ ఎరువును కలపడం వల్ల నేల గుల్లబారుతుంది. దీంతో మొక్కల వేర్లు భూమిలోకి చొచ్చుకుపోయి పైరు ఏపుగా పెరుగుతుంది.
- వేసవిలో దుక్కిదున్నే ముందు భూమిలో సేంద్రీయ ఎరువు చల్లాలి. అనంతరం ఎరువును కలియదున్నితే పెద్ద వర్షాలకు సేంద్రీయ ఎరువు కొట్టుకుపోకుండా ఉంటుంది.
- మందుకట్టలు పెట్టుబడి తగ్గుతుంది.

ఎరువులు లభ్యత ఇలా..

- పశువుల పేడను కంపోస్టు విధానం ద్వారా నిల్వచేసుకున్న తరువాత పంట పొలాలకు తరలించుకోవాలి.
- వేపపండి, పొగాకు పిట్టు వంటివి నాణ్యమైనవి కొనుగోలు చేసుకోవచ్చు. రైతులు సొంతంగా వర్మీ కంపోస్టు తయారు చేసుకోవచ్చు.
- పశువుల వ్యర్థాలు, వర్మీ కంపోస్టు ఎరువుల లభ్యత కానీ రైతులు పచ్చిరొట్ట పైర్లను కూడా సాగుచేసుకోవచ్చు. పంటలు వేసేందుకు కనీసం నెల రోజులు ముందుగా పెసర, పిల్లిపెసర, జీలుగ, మినుము, బొబ్బర వంటి విత్తనాలను చల్లుకోవాలి అవి బాగా ఏపుగా పెరిగిన తరువాత ట్రాక్టర్‌తో భూమిలోపలికి పోయేలా కలియదున్నుకుంటే కుళ్లిపోయి భూమికి కావాలసిన సారాన్ని అందిస్తుంది.

సేంద్రియంతో బహుళ ప్రయోజనం

సేంద్రియ ఎరువులను వాడడంవలన రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. పశువుల వ్యర్థాలు, పచ్చిరొట్ట పైర్లను సాగుచేయడంవలన భూమి సారవంతమవుతుంది. దీంతో పంట ఏపుగా పెరగడంతోపాటు పెట్టుబడులు కూడా తగ్గుతాయి. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల పంటభూములు చౌడుగా మారుతాయి.

– వి.రవికుమార్, వత్సవాయి మండల వ్యవసాయాధికారి

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ M.S.M Inter(V) College, Guntur. 10th Pass అయిన వారికి MLT, MPHW (నర్సింగ్), Agriculture, Veterinary Coursesలకు అడ్మిషన్లు జరుగుచున్నవి. 7386706839, 7386406839

REAL ESTATE

PLOT FOR SALE

■ లాం చలపతి ఇంజనీరింగ్ కాలేజ్ వెనుక APCRDA & APRERA అప్రూవ్డ్ లేఅవుట్ 240 గజాల తూర్పు & పడమర ప్లాట్లు అన్ని వసతులతో కేవలం గజం 13 వేలకు మాత్రమే ✆ 9177265959

■ 22 సెంట్లు భూమి రూ. 7,50,000/- స్పాట్ 0. ఒకే పెట్టుబడి పై 3 ఆదాయాలు. ఆవకాడో ఫ్రూట్‌పై ప్రతీ సం॥లక్షల్లో ఆదాయం. అద్దంకి దగ్గర్లో గుంటూరు నుండి గంట ప్రయాణం. 83175 28192

LEASE / SALE

■ 12 ఎకరాలు నీటి వసతి గల పొలం కౌలుకు గాని/అమ్మకానికి గాని సిద్ధముగా ఉన్నది. వివరాలకు సంప్రదించండి. సెల్: 96408 47247, 70753 73118.

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ ఒంగోలు శ్రీసరస్వతి విద్యా సంస్థలు నందు పనిచేయుటకు JL's (మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ)-M/F, లేడీ PET's లేడీ క్యాంపస్ ఇన్‌ఛార్జిలు (కనీసం 3 సం॥లు అనుభవం కలిగిన) వార్డెన్స్ (M/F) కావలెను. ఫ్రీ వసతి, భోజనం కలదు. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర॥ ✆ 81420 28977, 91008 31314.

■ గుంటూరు RTO ఆఫీసు నుండి పలకలూరు వెళ్ళే రోడ్ (Phase-3) డాక్టర్స్ కాలనీలో 170 చ.గ. రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్లు మంచి రీజనబుల్ ధరలో కలవు. సంప్ర: 98481 84569

■ Wanted Male Campus incharges, Male Marketing Vice Principals and Executives. Qualification Any Degree Must be married. Salary Upto Rs.20000/- Place of work Master Minds College, Guntur. Contact 9248733344

■ మాంటిస్సోరి E.M స్కూల్ శ్యామలనగర్, లక్ష్మీపురం గుంటూరు నందు పనిచేయుటకు బస్సు డ్రైవర్లు, క్లీనర్లు, ఆఫీస్ బాయ్స్, ఆయాలు వంట మనిషి కావలెను. 8121400100

■ గుంటూరు, బోయపాలెం, మార్టూరు సమీపంలో గల ప్రముఖ స్పిన్నింగ్ మిల్స్‌లో సెక్యూరిటీగార్డ్సు కావలెను. ఉచిత వసతి, సబ్సిడీ భోజన సదుపాయం కలదు. 9848091341, 9846176356

■ ఇంటివద్దనే ఉండి పిల్లలను/ పేషెంట్లను చూసుకొనుటకు ట్రైన్డ్ నర్సులు/ఆయాలు హైదరాబాద్, విజయవాడలో పని చేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం + వసతి + భోజనం. ✆ 98850 25559, 91608 35559

■ Wanted The YOUNG Talented TEACHERS Teach in English L.K.G to 8th Class for ALL SUBJECTS. Minimum 2 Years Experience. Send Your Resumes Before June 10th SRI SRINIVASA HIGH SCHOOL EPURUPALEM, CHIRALA ✆ 90107 33537.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217

■ శ్రీ కాంతి హోమ్‌నీడ్స్‌లో పనిచేయుటకు తెనాలి, గుంటూరు, రేపల్లె, తిరుపతిలో ఆయాలు నర్సులు కేర్‌టేకర్స్ (లేడీ/జంట్స్) కావలెను. జీ: 16,000/- ✆ 7995123705, 9618485329

■ గుంటూరులో గల ఏటుకూరు, బొంత పాడు నందు జాబ్ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్రదించండి. ✆ 83674 60999, 83674 90999

■ వయస్సు 30 సం॥ పైబడిన వివాహిత స్త్రీలు కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్‌గా వర్క్ చేయుటకు గుంటూరులోని ఫైనాన్షియల్ సర్వీ సెస్ వారి ఆఫీసు నందు సంప్ర ✆ 75694 78729 అర్హత ఇంటర్ మీడియట్ ఉత్తీర్ణత

■ ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, వంట/ఇంటి పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 20K. Ph: 8977639622, 8977639663

■ Required Collection Experienced Exceutives & Backend for Bank Recovery in Vijayawada and Guntur. Attractive Salary. 9885556922

సాక్షి క్లాసిఫైడ్స్

గుంటూరు

7075167541
7075167663

గమనిక